

'ఓటర్ల జాబితా తయారీకి సూచనలివ్వండి'

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయపార్టీల నేతలు తగు సూచనలు, సలహాలు అందజేయాలని శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ కార్యాలయ పరిపాలనాధికారి లక్ష్మీనారాయణ కోరారు. శ్రీకాకుళంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ నేతలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ 'ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒక పోలింగ్ కేంద్రంలో 1200ఓటర్లు దాటి ఉంటే ఆ కేంద్రాన్ని రేషనలైజేషన్ చేయాలి. అందుకు మంచి భవనం ఉంటే సూచించాల'ని కోరారు. అలాగే అన్ని పార్టీల నేతలు బూత్‌లెవెల్ ఏజెంట్ల జాబితాను ఇవ్వాలని తెలిపారు.

తగ్గిన వాన.. పెరిగిన ఎండ

- ఆశించిన స్థాయిలో కురవని వర్షాలు
- జూలైలోనూ లోటు వర్షపాతమే...
- ఉక్కపోతతో ప్రజల అవస్థలు



శ్రీకాకుళం, జూలై 29(ఆంధ్రజ్యోతి):

పేదల ఊటీగా పేరొందిన శ్రీకాకుళం జిల్లాలో వర్షాకాలంలోనూ వేసవి తాపం వీడట్లేదు. ఆశించినస్థాయిలో వర్షాలు కురవకపోవడం.. చాలాచోట్ల చిరుజల్లులకే పరిమితం కావడంతో పగలు వేసవి మాదిరి ఎండ తీవ్రత కనిపిస్తోంది. అప్పుడప్పుడు మేఘాలు కమ్ముకున్నా.. ఆపై బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినా జిల్లాపై వర్ష ప్రభావం పెద్దగా చూపలేదు. దీంతో ఇప్పటికీ లోటు వర్షపాతం వెంటాడుతోంది. ఆపై ఉక్కపోతతో జిల్లాప్రజలు (మిగతా 6వ పేజీలో..)

శ్రీకాకుళం రూరల్: నీరు లేక వరినారు ఇలా..

శ్రీకాకుళంలో నిర్మానుష్యంగా రహదారి

జిల్లాలో ఇదీ పరిస్థితి..

మండలం	సోమవారం ఉష్ణోగ్రతలు	జూన్1 నుంచి జూలై 29 వరకు వర్షపాతం
ఆమదాలవలస	34.56	-9.35
బూర్జ	36.29	-17.4
ఎచ్చెర్ల	35.1	1.95
జి.సిగడాం	34	0.32
గార	36.1	-2.48
హిరమండలం	36.1	-31.6
ఇచ్ఛాపురం	33.7	-33.71
జలుమూరు	33.9	-7.83
కంచిలి	35.5	-14.5
కవిటి	33.6	-31.18
కోటబొమ్మాళి	34.36	-13.3
కొత్తూరు	35.1	-29.54
లావేరు	36.44	15.95
ఎల్.ఎన్.పేట	36	-14.93
మందస	35.9	-5.14
మెళియాపుట్టి	35.71	-25.18
నందిగాం	34.5	-9.46
నరసన్నపేట	36.1	-19.02
పలాస	37	-13.17
పాతపట్నం	35.2	-18.96
పోలాకి	32.5	-16.88
పొందూరు	36.41	-12.69
రణస్థలం	33.6	18.63
సంతబొమ్మాళి	34.6	-9.22
సారవకోట	38.9	-28.76
సరుబుజ్జిలి	35	-15.58
సోంపేట	33.9	-7.4
శ్రీకాకుళం	34.3	13.39
టెక్కలి	34.5	-22.53
వజ్రపుకొత్తూరు	36.0	-5.79

పూడిలంకకు మోక్షం

- రూ.4కోట్లతో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన: మంత్రి అచ్చెన్న

వజ్రపుకొత్తూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): చిరకాల సమస్యగా ఉన్న పూడిలంక గ్రామానికి వంతెనతో కూడిన రహదారి నిర్మిస్తామని రాష్ట్ర మత్స్య, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి రూ.నాలుగు కోట్ల వ్యయంతో నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'టీడీపీ హయాంలో పూడిలంక రహదారి నిర్మాణానికి భూమిపూజ చేసి కొంతమేర పనులు చేపట్టాం. తర్వాత వైసీపీ పాలనలో పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి మేరకు ఈసారి శాశ్వత ప్రాతిపదికగా ఉపాధిహామీ నిధులతో నిర్మాణం చేపడుతున్నాం. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.100 కోట్లతో పూండి రోడ్డు కూడా నిర్మిస్తాం. టెండర్లు పూర్తయిన వెంటనే పనులు చేపట్టనున్నాం. పూండి రోడ్డు విస్తరణ పూర్తయితే మూడు మండలాలకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. బెండిరోడ్డు పనులు కూడా జరుగుతున్నాయి. వైసీపీ తప్పుడు నిర్ణయాలతో రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక పరిస్థితులు ఉన్నా.. హామీలన్నీ నెరవేరుస్తున్నామ'ని తెలిపారు.

పర్యాటకాభివృద్ధికి కృషి : కలెక్టర్

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 'పూడిలంక వంతెన పూర్తయిన వెంటనే.. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందిస్తాం. పర్యాకాభివృద్ధితో ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి. పూడిలంకలో 56ఇళ్లు మాత్రమే ఉన్నా.. మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశామ'ని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీష, ఆర్డీవో జి.వెంకటేష్, నాయకులు వజ్జ బాబురావు, సూరాడ మోహనరావు, నెయ్యల సూర్యానారాయణ, అగ్నికుల కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వర్రావు, మాజీ ఎంపీపీ వసంతస్వామి, అరసవెల్లి ఉమా, బి.శశి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

తొలగిన అడ్డంకులు

- తాళభద్ర-నర్సిపురం రహదారికి మార్గం సుగమం
- హద్దులు గుర్తించి కంచె వేస్తున్న రైల్వేశాఖ
- నెరవేరనున్న దశబ్దాల నాటి కల 8లో

ఇక్కడా.. భద్రత లేదా?

- ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ మోసాలేనా?
- సిబ్బంది చేతివాటంతో ఖాతాదారులకు ఇక్కట్లు
- పోస్టాఫీసుల్లో కానరాని అధికారుల పర్యవేక్షణ



ఇచ్ఛాపురంలో పోస్టల్ కార్యాలయం



కౌంటర్ వద్ద పాస్‌బుక్ చెక్ చేసుకోవడానికి ఖాతాదారుల పాట్లు

ఇచ్ఛాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, వివాహాలు, అత్యవసర వైద్యసేవలు నిమిత్తం చాలా మంది డబ్బులు పోస్టాఫీసు, బ్యాంకుల్లో దాచుకుంటుంటారు. కాగా, ప్రైవేటు సంస్థల మాదిరి.. ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ ఆన్‌లైన్ మోసాలు జరుగుతుండడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. తాము డబ్బులు ఎక్కడ దాచుకుంటే.. భద్రత లభిస్తుందో తెలియక సతమతమవుతున్నారు. ఇటీవల ఇచ్ఛాపురం పోస్టాఫీసులో కొంతమంది సిబ్బంది చేతివాటం కారణంగా భారీ ఆన్‌లైన్ మోసం బయటపడడంతో ఖాతాదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని ఆరోపిస్తున్నారు. సాధారణంగా బ్యాంకులు, పోస్టల్ కార్యాలయాలు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నడుస్తుంటాయి. రాష్ట్ర ప్రభుత్వాలతో ఎటువంటి సంబంధం ఉండదు. అందుకే వీటి పర్యవేక్షణ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు తెలుస్తోంది.

- కొన్నేళ్ల కిందట జిల్లాలో అగ్రిగోల్డ్ సంస్థ పెద్ద ఎత్తున డిపాజిట్లు సేకరించింది. ప్రారంభంలో ఆ సంస్థ డిపాజిట్లపై అనుకున్నస్థాయిలో చెల్లింపులు చేయడంతో లక్షలాది మంది ఖాతాదారులు పెరిగారు. కానీ సదరు సంస్థ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి (మిగతా 6వ పేజీలో..)

ప్రతి ఖాతాదారునికి న్యాయం చేస్తాం

- జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు

ఇచ్ఛాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పోస్టాఫీసులో జరిగిన రూ2.78కోట్ల కుంభకోణంపై జిల్లా పోస్టల్ ఆఫ్ సూపరింటెండెంట్ హరిబాబు దృష్టి సారించారు. మంగళవారం పోస్టాఫీస్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, క్లయిమ్‌లను పరిశీలించారు. అప్పటికే ఖాతాదారులు అక్కడకు చేరుకుని తమ డబ్బులు ఇవ్వాలంటూ ఆందోళన చేశారు. ఖాతాదారులకు న్యాయం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి, రాజు పలువురు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఖాతాదారులందరికీ వడ్డీతో సహా పోస్టాఫీసులో దాచుకున్న డబ్బులను త్వరలో తిరిగి ఇచ్చేస్తామని హరిబాబు హామీ ఇవ్వడంతో శాంతించారు. మంగళవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడంతో ఖాతాదారులంతా పోస్టాఫీసుకు చేరుకున్నారు. తమ ఖాతాల్లో డబ్బులు ఉన్నాయో.. లేదో.. పరిశీలించుకునేందుకు బారులుదీరారు.

రికవరీ చేస్తాం

సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ అధికారి హరిబాబు విలేకరులతో మాట్లాడుతూ.. 'పోస్టల్‌లో కొంత మంది స్వార్థపరులు సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి ఆన్‌లైన్ మోసానికి పాల్పడ్డారు. ఇచ్ఛాపురం పోస్టాఫీసు పరిధిలో 15 బ్రాంచ్‌లు ఉన్నాయి. సుమారు 35వేల మంది ఖాతాదారులు ఉన్నారు. 33 మంది ఖాతాదారుల నుంచి రూ.2.78 కోట్లు గల్లంతయ్యాయని గుర్తించారు. ఇంకా ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం. పోస్టల్ ఖాతాకు ఖాతాదారులు ఫోన్ నెంబర్‌ను లింక్ చేసుకోవాలి. అలా చేస్తే డబ్బులు డిపాజిట్ చేసినా, విత్‌డ్రా చేసినా ఫోన్ ద్వారా సమాచారం వస్తుంది. వెంటనే అప్రమత్తం కావచ్చు. ఖాతాదారులు ఏ బ్రాంచ్ పోస్టాఫీసులోనైనా ఖాతాల్లో డబ్బులు ఉన్నాయో లేవో పరిశీలించుకోవచ్చు. ఇప్పటికే ఈ కేసును సీబీఐకి అప్పగించాం. వారి ద్వారా ఈడీకి కూడా ఈ కేసు వెళ్తుంది. త్వరలో నేరగాళ్లను పట్టుంటాం. డబ్బులు రికవరీ చేసి.. ఖాతాదారులకు అందజేస్తామ'ని తెలిపారు. పోస్టల్ ఏజెంట్లను కూడా విచారణ చేస్తామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు

కొలిక్కి వచ్చిన పోర్టు రైల్వేలైన్

- పంట పొలాలు ముంపు బారిన పడకుండా చర్యలు



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సంతబొమ్మాళి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు కోసం నిర్మిస్తున్న రైల్వే లైన్ వల్ల రైతుల పంట పొలాలు ముంపు బారిన పడకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రైల్వేలైన్ ఏర్పాటుకు మట్టి పోయడంతో చిన్నపాటి వర్షానికే వరి నారు మడులు నీటమునిగాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పోర్టు, ఇరిగేషన్ అధికారులు మంగళవారం ఈ పరిసరరాలను పరిశీలించారు. వారికి కోటపాడు గ్రామానికి చెందిన రైతు కోత మధుసూదనరావు రైల్వే ఏర్పాటు వల్ల పంట పొలాలు ఎలా ముంపునకు గురవతాయనేది వివరించారు. ముంపు నివారణలో భాగంగా యామలపేట వద్ద కాలువతోపాటు అండర్‌పాసేజ్, తంపరలో రెండు పెద్ద ఓపెన్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. హనుమంతునాయుడుపేట పొలం రోడ్డుకు అండర్‌పాసేజ్‌తో పాటు మూడు కల్వర్టులు, పాలనాయుడుపేట వద్ద మురుగునీరు పోయే కాలువ నీరు భావనపాడు సముద్రానికి వెళ్లేందుకు మార్గం అడ్డంకి లేకుండా చర్యలు తీసుకోవడానికి అంగీకరించారు. కార్యక్రమంలో టెక్కలి వంశధార డీఈ శ్రీధర్, పోర్టు ఇంజనీరింగ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆశావహులకు నిరాశే





- కొత్త జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్
- 2034 ఎన్నికల వరకు అవకాశం లేదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

పలాస, జూలై 29(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ స్థానాలు వచ్చే ఎన్నికల నాటికి పెరుగుతాయి. అందులో ముఖ్యంగా పలాస డివిజన్‌లోని రెండు అసెంబ్లీ సీట్లకు బదులు మూడు వస్తాయి. అందులో మనకు అవకాశాలు దక్కుతాయి' అనుకున్న వివిధ రాజకీయపార్టీల నేతల ఆశలపై సుప్రీంకోర్టు నీళ్లు చల్లింది. 2034 సంవత్సరంలో జరిగే సార్వత్రిక ఎన్నికలైతే కానీ, ఆ అవకాశాలు లేవని స్పష్టం చేయడంతో అంతా నిరాశ చెందుతున్నారు. 2014 అమలులోకి వచ్చిన రాష్ట్ర విభజన చట్టంలో అసెంబ్లీ స్థానాలు పెంచుకోవడానికి వెసులుబాటు కల్పించారు. ఆ మేరకు 2026 నాటికి జనగణన జరిగి నియోజకవర్గాలు పెంచుకోవడానికి అవకాశం ఏర్పడింది. అయితే 2011 తరువాత 2021 సంవత్సరంలో గణన జరగాల్సి ఉండగా, కొవిడ్ వ్యాప్తి కారణంగా దీన్ని నిలుపుదల చేశారు. ప్రస్తుతం ఏ కార్యక్రమం చేపట్టాలన్నా 2011 లెక్కల ప్రకారమే నిర్వహిస్తుండడంతో నియోజకవర్గాల పెంపు ప్రక్రియకు దూరం కావాల్సి వచ్చింది. రాష్ట్రవిభజన చట్టంలో వెసులుబాటు కల్పించినా రాజ్యాంగం ప్రకారం జరగదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పేసింది. ప్రస్తుతం జనగణన 2027 సంవత్సరంలో మొదలుకావడంతో అది పూర్తయి నివేదిక అందిన తరువాతే కొత్తగా డీలిమిటేషన్ జరుగుతుందని ప్రకటించడంతో ఆశావాహులు చతికిలపడ్డారు.

- జిల్లాలో నియోజకవర్గ పునర్విభజనలో ఎక్కువగా పలాస డివిజన్‌లో ఒక అసెంబ్లీ స్థానం అదనంగా రావడానికి అవకాశం ఉంది. గత ఎన్నికల నుంచి దీనిపై విస్తృత ప్రచారం జరుగుతోంది. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలు ప్రస్తుతం ఉండగా, కొత్తగా సోంపేట నియోజకవర్గం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. గతంలో సోంపేట నియోజకవర్గంగా ఉండేది. కొత్తగా పలాస వేరైన తరువాత సోంపేట పూర్తిగా రద్దయింది. దీంతో మళ్లీ పాత సోంపేటను నియోజకవర్గంగా (మిగతా 6వ పేజీలో..)

అధికారులు మారినా..

అధికారం వారిదే

- ఆదిత్యాలయంలో దినసరి ఉద్యోగుల హవా
- అక్రమ వసూళ్లలో కీలకంగా వ్యవహరిస్తున్న వైనం

అరసవల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో ఆదిత్యాలయంలో దినసరి ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు మారినా.. అధికారం మాత్రం వారిదే అన్న చందంగా.. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తప్పుడు బిల్లులతో ఆలయ సొమ్మును స్వాహా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బదిలీపై వెళ్లిపోయిన కొంతమంది సిబ్బందిపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. వారి డేటాను సేకరించి.. తప్పుడు బిల్లులపై బ్యాంకులో విత్‌డ్రా చేసిన డబ్బుల విషయమై విచారణ చేపట్టినట్టు తెలిసింది. ఇదంతా గోప్యంగా ఉంచినా, (మిగతా 8వ పేజీలో..)



ఆదిత్యాలయం

కలం.. గళం... న్యాయం కోసమే
- ఇదీ రావిశాస్త్రి ప్రత్యేకత ● సిక్కోలు ఖ్యాతిని ఇనుమడింపజేసిన రచయిత
- న్యాయవాదిగానూ మంచి పేరు ● నేడు ఆయన జయంతి
6లో

ఉద్యోగాలపై ఆశతో..
- మాయగాళ్లకు చిక్కుతున్న యువతీ యువకులు
- ఉపాధి కల్పన పేరిట మానవ అక్రమ రవాణా

వీడియోలు చూసి.. ఉచ్చులోపడి
- మోసపోయిన బ్యాంకు ఉద్యోగి
- రూ 11.5 లక్షలు టోకరా పెట్టిన సైబర్ నేరగాళ్లు
7లో

నాసిరకం మందుల తయారీ కంపెనీ యజమానికి జైలు
8లో

ఉద్యోగాలపై ఆశతో..

- మాయగాళ్లకు చిక్కుతున్న యువతీ యువకులు
- ఉపాధి కల్పన పేరిట మానవ అక్రమ రవాణా
- నిఘా మరింత పెంచితేనే ఫలితం
- నేడు 'ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం'



పేదరికం...నిరుద్యోగం జనానికి శాపం. అవే కొందరికి వరం. పేదరికంతో బాధ పడుతున్న వారు... నిరుద్యోగ సమస్యతో కుంగిపోతున్న వారే వారికి ఆధారం. ఉద్యోగాలు... ఉపాధిని ఎరజూపి రాష్ట్రాలు.. దేశాలను దాటిస్తున్నారు. మోసపు మాటలతో... మాయచేసి మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. విదేశాలకు తరలించి... చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో భాగస్వాములను చేస్తున్నారు. ఈ మాయగాళ్ల వలలో చిక్కుకుంటున్న యువతీ యువకులు... మహిళల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంటోంది.



శ్రీకాకుళం, జూలై 29(ఆంధ్రజ్యోతి)

మానవ అక్రమ రవాణా అంటే బలవంతంగా... మోసగించి.. బెదిరించి.. శ్రమదోపిడీ.. లైంగిక దోపిడీ.. అవయవాల విక్రయం లేదా ఇతర నేరపూరిత కార్యకలాపాల కోసం అక్రమంగా మనుషులను తరలించడం. నేరగాళ్లు సాధారణంగా పేదరికం, నిరుద్యోగం, అజ్ఞానం వంటి బలహీనతలను ఆసరాగా చేసుకొని... అమాయకులను లక్ష్యంగా చేసుకుంటారు. మంచి ఉద్యోగాలు... ఉన్నత విద్య.. మెరుగైన జీవితం వంటి ఆశలను చూపించి వారిని వేరే ప్రాంతాలకు తరలించి... అక్కడ అమానవీయంగా బానిసలుగా మార్చుకుంటారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో భాగస్వాములను చేస్తున్నారు. యువతులు, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న సంఘటనలు ఎన్నో.

● జిల్లాలో ఇలా...

శ్రీకాకుళం జిల్లా వలసల కేంద్రంగా ఉండటంతో ఇక్కడ మానవ అక్రమ రవాణాకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలకు, నగరాలకు వెళ్లే క్రమంలో చాలామంది మోసగాళ్ల చేతుల్లో చిక్కుకుంటున్నారు. నకిలీ ఏజెంట్లు, దళారులు అమాయకులకు ఆశలు చూపించి వారిని దగా చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే నిరక్షరాస్యులు, సరైన సమాచారం లేని వారు సులభంగా వీరికి బలి అవుతున్నారు.

తీర ప్రాంతాల్లో చాపకింద నీరులా..

విదేశాల్లో ఉద్యోగాలు..పెద్దపెద్ద షిప్పుల్లో సీమెన్‌గా పని చేయాలంటూ గతంలో తీర ప్రాంత గ్రామాల యువకులను అటు వైపు నుంచి వచ్చిన దళారులు అడ్వాన్సులు చెల్లించి తీసుకువెళ్లేవారు. ఇందులో యువకులు.. బాలురు ఉండేవారు. అమాయకులు వారి మాటలను నిజమేనని నమ్మి... వారితో వెళ్లి ఇబ్బందులకు గురవుతున్నారు. మరికొందరు విశాఖ తదితర ప్రాంతాల్లోని నకిలీ ఏజెంట్లను నమ్మి.. అరబ్బు దేశాలకు వెళ్లి.. అక్కడ తిండికి కూడా ఇబ్బంది పడుతూ... ప్రభుత్వాల సాయంతో కొందరు ఇళ్లకు చేరుకుంటున్నారు. మరికొంతమంది దిక్కు తోచని స్థితిలో అక్కడే మగ్గుతున్నారు. అక్కడ ప్రాణాలు విడిస్తే.. ఆ మృతదేహం తీసుకురావడానికి కూడా పడే అవస్థలు వర్ణనాతీతం. వెనుకబడిన ప్రాంతం కావడంతో.. మోసగాళ్ల వలకు తేలిగ్గా చిక్కి చాలామంది బలవుతున్నారు. దీనిపై పోలీసులు, అటు ఏహెచ్‌టీయూ, ఇటు ఐసీపీఎస్ వంటి విభాగాలు దృష్టి సారించి ఎక్కడికక్కడే కళ్లెం వేస్తుండటంతో కొంతమేర ఈ తరహా మోసాలు తగ్గాయి.

ఎలా జాగ్రత్త పడాలంటే...

మానవ అక్రమ రవాణా నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి, ఇతరులను రక్షించడానికి కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలి.

ధ్రువీకరణ లేని ఆఫర్లను నమ్మకూడదు

సులభంగా డబ్బు సంపాదించవచ్చని... విదేశాల్లో మంచి ఉద్యోగాలు ఉన్నాయని చెప్పే వ్యక్తులను గుడ్డిగా నమ్మవద్దు. ఏదైనా ఆఫర్ మంచిది అని అనిపిస్తే.. దాని గురించి పూర్తిగా పరిశీలన చేసి విచారణ చేపట్టాల్సిందే.

నకిలీ ఏజెంట్లను గుర్తించండి..

ఉద్యోగంతోపాటు వసతి కల్పిస్తామని చెప్పి డబ్బు వసూలు చేసే నకిలీ ఏజెంట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. వారి ధ్రువపత్రాలను, సంస్థ విశ్వసనీయతను స్వయంగా ధ్రువీకరించుకోవాలి.

వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దు

మీ వ్యక్తిగత పత్రాలను ... ఇతర సున్నితమైన సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోవద్దు.

కుటుంబ సభ్యులతో సంప్రదించాలి..

ఎక్కడికైనా వెళ్లే ముందు .. ఏదైనా ఒప్పందం కుదుర్చుకునే ముందు మీ కుటుంబ సభ్యులు లేదా నమ్మకమైన స్నేహితులతో చర్చించండి. సందేహం వస్తే.. ఎవరిపైనైనా అనుమానం వచ్చినా. మానవ అక్రమ రవాణాకు సంబంధించిన ఏదైనా సమాచారం తెలిసినా...వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయండి.

సాయం కోసం సంప్రదించాల్సిన నంబర్లు..

పోలీసు హెల్ప్‌లైన్ 100, మహిళా హెల్ప్‌లైన్ 1098 (పిల్లల కోసం), జాతీయ మానవ హక్కుల కమిషన్ సంబంధిత అధికారుల నంబర్లు (జిల్లా పోలీసు కార్యాలయంలో లేదా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు) కు సమాచారం తెలియజేయాలి.

● అధికారులు ఏం చేశారంటే..

శ్రీకాకుళం జిల్లాలో 2024 జనవరి నుంచి డిసెంబరు వరకు మానవ అక్రమ రవాణా నిరోధానికి సంబంధించి ఆపరేషన్ స్వచ్ఛ, ప్రోగ్రామ్ - 5, వీధి బాలల రెస్క్యూ ఆపరేషన్-1, చైల్డ్ లేబర్ డ్రైవ్‌లు -3 .. తదితర కార్యక్రమాలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా వివిధ దుకాణాలు, పరిశ్రమలు, వ్యాపారాల్లో పనిచేస్తున్న 72 మంది పిల్లలను పట్టుకొని... వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాశీబుగ్గ పోలీ సు స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేశారు. పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి యాజమానులకు, పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో 26 మంది యజమానులపై జరిమానా విధించారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలలో 'మానవ అక్రమ రవాణా నిరోధం, పిల్లలపై లైంగిక వేధింపులు, బాలల హక్కులు, పిల్లలపై వర్తించే చట్టాలపై, బాల్య వివాహాలు నిర్మూలన వంటి వాటిపై 96 అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. 2025లో జనవరి నుంచి జూలై 2 వరకు 30 మందిని రెస్క్యూ చేసి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



వంతెన పనులను పునఃప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష

8 నెలల్లో రైల్వే వంతెన పూర్తి

- మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టీకరణ
- పునర్నిర్మాణ పనులు ప్రారంభం

కాశీబుగ్గ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే వంతెన నిర్మాణాన్ని 8 నెలల్లో పూర్తి చేసి.. జాతికి అందిస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పలాస రైల్వే వంతెన పునర్నిర్మాణ పనులను మంగళవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల వంతెన నిర్మాణ అంచనాలు పెరిగాయని చెప్పారు. అయినా సరే నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి వంతెనను సమాజానికి అంకితం చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ఇది చేతల ప్రభుత్వమన్నారు. గత పాలకులు ఆర్భాటాలతో నెట్టుకొచ్చారని విమర్శించారు. 2026 మార్చి నాటికి పూర్తి చేసి ప్రజల వద్దకు వెళ్తామని అన్నారు. మార్చి నెలలో ముఖ్య మంత్రి నారా చంద్ర బాబునాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవోతో పాటు ఏపీసీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వర రావు, పీరుకట్ల విఠల్‌రావు, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, చిన్ని, సూర్యనారాయణ, రాంబాబు, కె.సురేష్, నర్సింహులు, సత్యం తదితరులు పాల్గొన్నారు. వంతెన నిర్మాణంతో నిర్వాసితులుగా మిగిలిన తొమ్మిది మందికి రూ.22.19 లక్షలు మంజూరయ్యాయి. మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష కలిపి నిర్వాసితులకు చెక్కులు పంపిణీ చేశారు.

తగ్గిన వాన.. పెరిగిన ఎండ

(ఐదో పేజీ తరువాయి)

అవస్థలు పడుతున్నారు.

● 13.31 శాతం లోటు వర్షపాతం..

వాతావరణ గణాంకాల ప్రకారం జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది జూన్ 1 నుంచి జూలై 29వరకు 291.53 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాలి. కానీ పెద్దగా వర్షాలు కురవలేదు. 252.73 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. రెండు నెలల్లో 13.31 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం కారణంగా ప్రజలకు ఉపశమనం లభించడం లేదు. మరోవైపు వర్షాకాలంలోనే ఇలా ఉంటే ఖరీఫ్ సాగు పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్ ఆరంభంలోనే వరినాట్లు ఎండిపోతున్నాయని వాపోతున్నారు.

● వేసవి మాదిరిగా ఉష్ణోగ్రతలు..

జిల్లాలో నెల రోజుల నుంచి సుమారు 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సోమవారం గరిష్ఠంగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. మంగళవారం మాత్రం మబ్బులు కమ్ముకున్నాయి. అయినప్పటికీ 33 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండల తీవ్రత కారణంగా శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పాతపట్నం, ఆమదాలవలస, నరసన్నపేట, పలాస, టెక్కలి వంటి పట్టణాల్లోనూ.. అన్ని మండల కేంద్రాల్లో మధ్యాహ్నం రోడ్లు నిర్మానుష్యమవుతున్నాయి. జూలైలోనూ ఎండల తీవ్రత నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

కలం.. గళం.. న్యాయం కోసమే



రావిశాస్త్రి

ఆయన వృత్తి రీత్యా న్యాయవాది. ప్రవృత్తి రీత్యా రచయిత. న్యాయం కోసం పోరాడే నైజం ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఆ రచనలు ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయి. దశాబ్దాల కిందట రాసినా.. ఆయన నవలల్లోని పాత్రలు... అవే పరిస్థితులు ఇప్పటి సమాజంలోనూ మనకు కనిపిస్తుండడం విశేషం. ముఖ్యంగా ఉత్తరాంధ్ర మాండలీకంలో... శ్రీకాకుళం పల్లె భాష సొగసుతో ఆయన కలం నుంచి జాలువారిన రచనలు ఆలోచింప జేస్తాయి. తన రచనలతో విమర్శకుల ప్రశంసలు సైతం అందుకున్న ఆ రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి. రావిశాస్త్రిగా అందరికీ పరిచయమైన ఆయన జయంతి నేడు.

- ఇదీ రావిశాస్త్రి ప్రత్యేకత
- సిక్కోలు ఖ్యాతిని ఇనుమడింపజేసిన రచయిత
- న్యాయవాదిగానూ మంచి పేరు
- నేడు ఆయన జయంతి

ఎచ్చెర్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి)

రావిశాస్త్రిగా సుపరిచితులైన రాచకొండ విశ్వనాథ శాస్త్రి శ్రీకాకుళంలో సీతాలక్ష్మి, నారాయణ మూర్తి దంపతులకు 1922 జూలై 30న జన్మించారు. రావి శాస్త్రి అంటే సాహితీ లోకంలో తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఆయన రచనలను పరిశీలిస్తే సమాజంలో అన్యాయాలు, దౌర్జన్యాలు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజానీకం తరఫున వకల్తా పుచ్చుకున్నట్టు కనిపిస్తా యి. వృత్తిరీత్యా న్యాయవాది అయిన రావి శాస్త్రి న్యాయం కోసం పోరాడారు. ప్రవృత్తి రీత్యా రచయిత అయిన ఆయన సామాన్యుల పక్షాన నిలిచారు. ఉత్తరాంధ్ర మాండలికాలతో సామా న్యులు మాట్లాడుకునే భాషలో, సొగసుగా... పాఠకుల హృదయాలు స్పందించేలా పదునైన రచనలు చేశారు. ఆయన ఆంధ్రా యూనివర్సిటీ నుంచి తత్వ శాస్త్రంలో బీఏ (ఆనర్స్) పూర్తి చేశారు. 1942-46 మధ్య మిలటరీలో పనిచేశా రు. ఆ తర్వాత మద్రాసు యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టభద్రుడయ్యారు. క్రిమినల్ లాయర్‌గా పేరొందారు.

పదునైన పదజాలం..

రావిశాస్త్రి నవలల్లో 'అల్పజీవి' విమర్శకుల ప్రశంసలు పొందింది. ఆయన రచనల్లోని పదజాలం సంఘంలోని లోటుపాట్లను సూటిగా ప్రశ్నిస్తుంది. కథాసాగరం, రాచకొండ కథలు, రాజు-మహిషి, కలకంఠి, బానిస కథలు, ఆరు చిత్రాలు, రత్తాలు-రాంబాయి, సొమ్మలు పోనాయండి, గోవులొస్తున్నాయి జాగ్రత్త, బంగారం తదితర వాటిని రచించారు. నిజం నాటకం, తిరస్కృతి, విషాదం నాటికలను రచించారు. ఆయన జీవిత చరమాంకంలో 'ఇల్లు' అనే నవలను రాశారు. అయన మంచి కథకుడే కాదు.. నటుడు కూడా. తాను రాసిన 'నిజం'తో పాటు గురజాడ అప్పారావు రాసిన 'కన్యాశుల్కం' నాటకాల్లో కూడా నటించారు. నిజం నాటకం 1962 ప్రాంతంలో 100 ప్రదర్శనలు ఇవ్వడం విశేషం. 1975లో ఏర్పడిన అత్యవసర పరిస్థితిలో ఆయన జైలులో ఉన్నారు. జైలులో ఉండగానే 'రత్తాలు- రాంబాబు' అనే నవల రాశారు. 'ఈ అత్యవసర పరిస్థితి' అనే వ్యాసం రాశారు. అచ్చుకాని ఈ రచన రావిశాస్త్రీయం ద్వారా వెలుగు చూసింది. దేముడే చేశాడు, ఆరు సారా కథలు, ఆరు సారో కథలు, మరో ఆరు చిత్రాలు రాశారు.

ఆకట్టుకున్న 'ఆరు సారా కథలు'..

మద్యపాన నిషేధ చట్టం అమలులోకి వచ్చిన పరిణామాలపై ఆయన కలం నుంచి జాలువారిన 'ఆరు సారా కథలు' కథా సాహిత్యంలో ఓ విప్లవాన్ని సృష్టించింది. పాపి, మాయ, న్యాయం, మోసం, పుణ్యం, మోక్షం అనే ఆరు సారా కథలను ఆయన రాశారు. ఇవన్నీ సారా ఇతివృత్తం కలిగిన కథలే అయినప్పటికీ.. వీటిలోని సంఘటనలు ఆలోచింపజేస్తాయి. ఈ కథలను నిశితంగా అధ్యయనం చేస్తే పెట్టుబడిదారీ విధానం కనిపిస్తుంది. పాపి కథలో రామదాసు, నీలయ్య, 'మాయ' కథలో ముత్యాలమ్మ, పెద్ద ప్లీడరు, మూర్తి లాయరు, 'న్యాయం' కథలో ముద్దాయి అమ్మాయి (పేరు లేదు), 'మోసం' కథలో రాకెట్ అప్పారావు, గురయ్య, 'పుణ్యం' కథలో పోలమ్మ, లంపెన్ ప్రోలిటేరియట్, కరుణాకరం, 'మోక్షం' కథలో మెజిస్ట్రేట్ ముఖ్యపాత్రలు. పాపి కథలో రామదాసు ప్రతిజ్ఞ, మాయ కథలో ముత్యాలమ్మ ప్రసంగం, న్యాయం కథలో ముద్దాయి అమ్మాయి ఆక్రందన, మోసం కథలో రాకెట్ అప్పారావు ఉపదేశం, హెడ్‌కానిస్టేబుల్ ఉపన్యాసం సాహితీ శిఖరాలుగా పేర్కొనదగినవని శ్రీశ్రీ అభిప్రాయపడ్డారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ ఆరు సారా కథలను తన సొంత ఖర్చులతో అచ్చు వేయించి.. జ్యుడీషియల్ అధికారులకు పంపిణీ చేసినట్టు రావిశాస్త్రి కుమారుడు ఉమాకుమార్ శాస్త్రి ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. న్యాయ శాస్త్రంలోని లోపాలను ఆసరాగా చేసుకొని... బడాబాబులు తప్పించుకుంటున్నారని గమనించి... మూడు కథల బంగారం, తలుపు గొళ్లెం ఎత్తి చూపాయి అనే రచనలను వెలువరించారు.

బిరుదులు తిరస్కరణ..

బిరుదులు, బహుమతులు అందుకునే స్థాయి తనది కాదని సున్నితంగా తిరస్కరించేవారు రావిశాస్త్రి. 1983లో ఆంధ్రా యూనివర్సిటీ 'కళాప్రపూర్ణ'ను ప్రకటిస్తే, దానిని రావిశాస్త్రి తిరస్కరించారు. విశ్వనాథ శాస్త్రి కథా సంపుటికి 1966లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు రాగా..దానినీ తిరిగి ఇచ్చేశారు. 'స్త్రీ' అనే సినిమాకు మాటలు రాశారు. 'రాజా ఔర్ రాక్' అనే హిందీ చిత్రానికి స్క్రీన్‌ప్లే అందించారు. రావిశాస్త్రి రాసిన 'ఇల్లు' అనే నవలను చైనీస్, రష్యన్ భాషల్లోకి అనువదితమైంది. ఇది తెలుగు సాహిత్యానికి దక్కిన గౌరవం. పేదల వ్యథలే రావిశాస్త్రి కథలని చాలా మంది వ్యాఖ్యానిస్తారు. సామాన్యుల ఈతి బాధలు తెలిసిన రచయితగా వారిపక్షానే చివరి వరకు రచనలు చేసిన ధన్యజీవి ఆయన. 1993 నవంబరు 10న సాహితీ సేవకు సెలవు చెబుతూ శాశ్వత నిద్రలోకి జారుకున్నారు రావిశాస్త్రి. విశాఖపట్నంలోని బీచ్‌రోడ్‌లో ఆయన విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు.

ఆశావహులకు నిరాశే

(ఐదో పేజీ తరువాయి)

చేసేందుకు రాజకీయ పార్టీల నేతలు కూడా సుముఖంగా ఉన్నారు. ప్రస్తుతం పలాస నియోజకవర్గంలో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలతోపాటు పలాస-కాశీబుగ్గ పురపాలకసంఘం ఉంది. సోంపేట నియోజకవర్గం ఏర్పాటైతే సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు మండలాలు, పలాసలో పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీతోపాటు పలాస, మెళియాపుట్టి, నందిగాం మండలాలు కలపడానికి విశ్వప్రయత్నాలు జరిగాయి. అయితే దీనిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2034 సంవత్సరం వరకూ వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. డీలిమిటేషన్‌పై అనేక రాజకీయ పార్టీల నాయకులు గంపెడాశతో ఉన్నారు. ఇప్పటికే తాము ఏ అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేయాలో నిర్ణయించుకున్నారు. కులాలు, పార్టీల వారిగా అప్పుడే సమీకరణలు ప్రారంభించిన సమయంలో సుప్రీంకోర్టు పునర్విభజన కుదరదని తేల్చడంతో వారి ఆశలన్నీ నీరుగారిపోయాయి. ఇక కొత్త జిల్లాలపై ఆశతో ఉన్నారు. ఇప్పటికే డివిజన్ కేంద్రంగా ఉన్న పలాసను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని గట్టిగా డిమాండ్ ఉంది. దీనిపై ఇప్పటికే విశేష ప్రచారాన్ని కల్పిస్తున్నారు. నియోజకవర్గాల మాదిరిగా ఇది కూడా విఫలమైతే పలాసపై ఆశలు వదులుకోవాల్సిందే.

ఇక్కడా.. భద్రత లేదా?

(ఐదో పేజీ తరువాయి)

ఇతర వ్యాపారాల్లో పెట్టింది. క్రమేపీ ప్రజలకు చెల్లింపులు నిలిపివేసింది. తరువాత బోర్డు తిప్పేసింది. దీంతో గత ఏడేళ్లుగా బాధితులు డిపాజిట్ల నగదు కోసం ఎదురుచూస్తునే ఉన్నారు. తాజాగా ఇచ్ఛాపురంలోని పోస్టాఫీసులో స్కాం చర్చనీయాంశమవుతోంది. పోస్టాఫీసులో కట్టిన సొమ్ముకు భద్రత, రక్షణ, జవాబుదారీతనం ఉంటుంది. బీమా సైతం వర్తిస్తుంది అన్న నమ్మకం ఉండేది. కానీ ఇప్పుడు అదే శాఖలో సొంత సిబ్బంది మోసాలకు తెరలేపుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీనిని నియంత్రించాల్సిన అవసరం ఆ శాఖపై ఉందని పలువురు ఖాతాదారులు అభిప్రాయపడుతున్నారు.

● దొంగ పాస్ పుస్తకాలతో మోసం..



2017లో ఏజెంట్ ద్వారా కేవీపీ బాండ్ల రూపంలో మా కుటుంబంలో 11మంది పేర్లతో రూ.11లక్షలు డిపాజిట్ చేశాం. కుంభకోణం బయటపడిన తర్వాత మాకు ఇచ్చిన పాస్‌బుక్స్, బాండ్లు పరిశీలించగా.. నకిలీవేనని తేలింది. మేము దాచుకున్న డబ్బులు ఎలా వస్తాయి?. మా పిల్లల చదువులు, వివాహాల కోసం దాచుకుంటే.. ఇప్పుడు మోసపోయాం. మాకు న్యాయం చేయండి.

-చాట్ల లోహిదాస్‌రెడ్డి, బాధితుడు, బెల్లుపడ

● డబ్బులు వస్తాయో.. రావో..



పోస్టల్‌లో ఆడపిల్లల పేరున రూ.8లక్షలు డిపాజిట్ చేశాం. ప్రస్తుతం మా ఖాతా పూర్తిగా ఖాళీ అయిపోయింది. మా డబ్బులు వస్తాయో.. రావో.. అన్న ఆందోళన కలుగుతోంది.

-కదంబాల కిరణ్మయి, బాధితురాలు, ఇచ్ఛాపురం

● అప్రమత్తంగా ఉండాలి..



ప్రభుత్వ రంగ సంస్థల్లోనే ఖాతాదారులకు ఆర్థిక భరోసా ఉంటుంది. పోస్టల్, బ్యాంకుల్లో కచ్చితత్వం ఉంటుంది. సిబ్బంది మోసాలే వెలుగు చూస్తున్నాయి. కానీ సంబంధిత సంస్థలు కాదన్న విషయాన్ని గుర్తించుకోవాలి. ఇటీవల ఆర్థికపరమైన నేరాలు పెరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దళారులు, ఏజెంట్ల మాయ మాటలు నమ్మవద్దు. అధిక వడ్డీ ఆశచూపే వారి వలలో పడొద్దు. మోసం జరిగిన తరువాత పోలీసులను ఆశ్రయించినా.. రకరకాల కారణాలు చూపుతూ ఆర్థిక సంస్థల నిర్వాహకులు తప్పించుకుంటున్నారు. ప్రజలు ముందే మేల్కొంటే చాలా మంచిది.

-మీసాల చిన్నంనాయుడు, సీఐ, ఇచ్ఛాపురం

నీలమణిదుర్గకు సారె సమర్పణ



సారెతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

నందిగాం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నందిగాంలో కొలువై ఉన్న నీలమణి దుర్గ అమ్మవారికి శ్రావణ మాస మంగళవారం సందర్భంగా సారె సమర్పించారు. గ్రామస్థులు వివిధ రకాలుగా అందించిన సారె సామానును ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు మేళతాళాల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అర్చకుడు ఎం.రమేష్‌శర్మ పర్యవేక్షణలో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి... సారె సమర్పణ ప్రక్రియ పూర్తి చేశారు. సుగంధ ద్రవ్యాలతో పాటు అరిసెలు, పొంగడాలు, పసుపు, కుంకుమ తదితర వాటిని బుట్టల్లో కట్టి మహిళలు తలపై పెట్టుకొని...అమ్మవారి గుడికి చేరుకున్నారు. అక్కడ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి..అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

సామూహిక కుంకుమ పూజలు

జలుమూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పెద్దదూగాంలో కొలువుదీరిన పాతపట్నం అమ్మవారి సన్నిధిలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా అర్చకుడు మావుడూరు జగదీష్ శర్మ నేతృత్వంలో కుంకుమ పూజలు చేశారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన చేశారు. అనంతరం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజల్లో స్థానికులతో పాటు చిన్నదూగాం, రాణ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

చినుకుపడితే.. చదువులు అంతే

●పెచ్చులూడుతున్న శ్లాబ్ ●ఇదీ సన్యాసినీలాపురం పాఠశాల పరిస్థితి

టెక్కలిరూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సన్యాసినీలాపురంలో మూడు దశాబ్దాల కిందట నిర్మించిన మండల పరిషత్ పాఠశాల భవనం శిథిలావస్థకుచేరింది.ప్రధానంగా చిన్నపాటి చినుకులు పడినా శ్లాబ్ నుంచి నీరుకారిపోతుండడంతో ఆ సమయంలో చదువులు సాగడం లేదు. ఇక్కడ చదువుతున్న 20 మంది విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. భవనం ఏళ్ల తరబడి కనీస మరమ్మతులకు నోచుకోక పోవడంతో శ్లాబ్ పెచ్చులూడుతోంది.బోధన జరిగే సమయంలో పెచ్చులూడితే ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెం దుతున్నారు. చిన్నపాటి వర్షంకురిసినా గదిలోకి నీరు చేరడంతో కూర్చొవడానికి విద్యా ర్థులుఇబ్బందిపడుతున్నారు. దీంతో ఆ పూట సెలవు ఇవ్వాల్సివస్తోంది.తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేయడంతోపాటు కొత్త భవన నిర్మాణానికి నిధులు విడుదలచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న భవనంలో చదువుతున్న విద్యార్థులు

పిచ్చిమొక్కలు తొలగించక.. పొంచిఉన్న ప్రమాదం

●ఇదీ చిన్ననీలావతి -మాకన్నపల్లి రోడ్డులో పరిస్థితి

పలాస రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిన్ననీలావతి నుంచి మాకన్నపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిలో రెండువైపులా పిచ్చిమొక్కలు పెరగడం వల్ల ప్రమాదం పొంచిఉందని చోదకులు, ప్రయాణికులు వాపోతున్నారు. మొక్కలు రోడ్డుపైకి రావడంతో ఎదురుగా వచ్చే వాహనం దగ్గరికి వచ్చే వరకూ కనిపించకపోవంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా చీకటిపడిన తర్వాత విషకీటకాలు రోడ్డుపైకి వస్తుండడంతో ద్విచక్రవాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు.తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే జంగిల్‌క్లియరెన్స్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



నీలావతి నుంచి మాకన్నపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో ఇరువైపులా పెరిగిన తుప్పలు

తవ్వేసిన సీసీ రోడ్డును పూడ్చారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జి.సిగడాం, జూలై 29(ఆంధ్రజ్యోతి): గెడ్డకంచరాంలో తవ్వేసిన సీసీ రోడ్డును పూడ్పించినట్లు ఎంపీడీవో జి.రామకృష్ణ తెలిపారు. ఈనెల 21న ఆంధ్రజ్యోతిలో రోడ్డు తవ్వేసిన వారిపై చర్యలు తీసుకోండి శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితంకావడంతో అధికారులు మంగళవారం రోడ్డును పూడ్చడానికి చర్యలు తీసుకున్నారు. గెడ్డకంచరాం గ్రామశివాలయం నుంచి శ్మశాన వాటిక వరకు సుమారు రూ.13 లక్షలతో ఇటీవల సీసీరోడ్డు నిర్మించారు. అయితే ఆ సీసీ రోడ్డును గ్రామానికి చెందిన పలువురు అడ్డంగా తవ్వేసిన విషయాన్ని అధి కారులకు ఫోన్‌ద్వారా ఫిర్యాదుచేశారు. దీంతో అధికారులు రోడ్డు తవ్వేసిన బాధ్యులతో పూడ్పించారు. అయితే రోడ్డు తవ్వేసిన విషయాన్ని ఆంధ్రజ్యోతిలో ప్రచురితకావడంతో సమస్య పరిష్కారమయ్యిందని కూటమి నాయకుడు నక్క మురళీధరరావు తెలిపారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

సరుబుజ్జిలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వెన్నెలవలస వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించి దరఖాస్తు గడువు ఆగస్టు 13వ తేదీ వరకూ పెంచినట్టు విద్యాలయం ప్రిన్సిపాల్ బి.బేతనసామి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు.

శ్రీకాకుళంలో ఐవీఎఫ్ కేంద్రాల తనిఖీ



ఐవీఎఫ్ కేంద్రంలో పరిశీలిస్తున్న మేరీ క్యాథరిన్

అరసవల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఐవీఎఫ్ కేంద్రాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథరిన్ మంగళవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో నమోదవుతున్న కేసుల రికార్డులు, పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో వేంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్టీఐపై అవగాహన కలిగిఉండాలి

పాతశ్రీకాకుళం, జూలై29 (ఆంధ్రజ్యోతి):ఉద్యోగులకు సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ)పై అవగాహన కలిగిఉండాలని జిల్లా పట్టు పరిశ్రమ అధికారి పి.చంద్రజీవన్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని జిల్లా పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో ఆర్టీఐపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీఐ చట్టం శిక్షకుడు కొమ్మాజోశ్యుల వసంతకుమార్, అధికారులు డి. సన్యాసి, జి సన్యానమ్మ, ఏఎల్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గార/గారరూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ పైడిపునాయుడు తెలిపారు. మంగళవారం తూలుగు యూపీ స్కూల్‌లో విద్యార్థులకు నారీశక్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గార ఎస్ఐ ఎస్.గంగరాజు, హెచ్ఎంలు చమళ్ల రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●ఇచ్ఛాపురం,జూలై 29(ఆంధ్రజ్యోతి):నారీశక్తియాప్ మహిళలకు రక్షణగా ఉంటుందని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నారీశక్తి యాప్‌పై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో గోవిందరావు, రమణ, వజీర్, శంకరరెడ్డి పాల్గొన్నారు.

●ఆమదాలవలస, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని ఏడో వార్డు చింతాడ ప్రాథమిక పాఠశాల హైస్కూల్‌లోని విద్యార్థులకు శక్తి టీం ఇన్‌చార్జి వాసుదేవరావు ఆధ్వర్యంలో శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. కార్య క్రమంలో ఏఎస్ఐ డి.రమణమూర్తి, పోలీసులు మోహన్‌రావు, ఉషారాణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట సాగు ప్రకారం ఎరువుల పంపిణీ



సోంపేట: కూపన్ పంపిణీ చేస్తున్నతహసీల్దార్ అప్పలస్వామి

సోంపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): పంటసాగు విస్తీర్ణం, పంటదశ ప్రకారం వ్యవసాయ శాస్త్రవేత్తల సిఫారసు ప్రాప్తికి యూరియా, డీఏపీ అందించనున్నామని తహసీల్దార్ బి.అప్పలస్వామి తెలిపారు.మంగళవారం సోంపేటలోని జిల్లాసహకార వాణిజ్య సంస్థ కేంద్రం వద్ద మండలంలోని రైతులకు ఎరువులకు సంబంధించిన కూపన్లను రైతులకు పంపిణీచేశా రు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ టీ.భవా నీశంకర్, ఏవో బి.నరసింహమూర్తి, టీడీపీ నాయకులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, బీన వంశీ పాల్గొన్నారు.

●కంచిలి, జూలై 29(ఆంధ్రజ్యోతి): పెద్ద శ్రీరాంపురంలో రైతులకు ఎరువులు టీడీపీ మండలాధ్యక్షుడు మాదిన రామారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ గంగరాజు, ప్రసాదరావు,కన్నబాబు పాల్గొన్నారు.

●కంచిలి, జూలై 29(ఆంధ్రజ్యోతి): కంచిలిలోని కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మనగ్రోమోర్ సెంటర్‌ను తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఏవో సురేష్, ఆర్ఐ కృష్ణచంద్రరౌళోలు తనిఖీ చేశారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

ఆమదాలవలస, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో సస్యరక్షణ పద్ధతులను పాటించాలని ప్రకృతి వ్యవసాయ సీడీఎఫ్ చేపేన సురేష్ తెలిపారు.మంగళవారం మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లేడ గ్రామాల్లో రైతులతో లైన్‌షోయింగ్ విధానంలో వరి నాట్లు వేయించారు.

పురుగు మందుల వినియోగం తగ్గించాలి

●కంచిలి, జూలై 29(ఆంధ్రజ్యోతి):రైతులు పంటల్లో ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించాలని ఏవో కొంకేన సురేష్ తెలిపారు. గోకర్ణపురం, జలంత్రకోటల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

●ఇచ్ఛాపురం,జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో అజయ్‌కుమార్ తెలిపారు. లొద్దపుట్టి, మండపల్లిలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. అనంతరం రైతులకు ఎరువుల కూపన్లు అందజేశారు. కార్యక్రమంలో వీఏఏలు సోనియా, సునీత పాల్గొన్నారు.

మాకన్నపురంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

సోంపేట రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): మాకన్నపురంలో ఆంజనేయ స్వామి విగ్రహాన్నిమంగళవారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, చుట్టుపక్కల గ్రామాల భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

శ్రీకాకుళం, జూలై29 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని టీడీపీ కార్యకర్త జరుగుళ్ల చిట్టిబాబు మృతిచెందారు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారంరాత్రి చిట్టిబాబు కుటుంబసభ్యులను పరామర్శించారు. తక్షణ ఆర్థికసాయంగా రూ.50 వేలు ఎమ్మెల్యే అందజేశారు. ఆయన వెంట నగర తెలుగు యువత అధ్యక్షుడు దక్కి గిరిజా శంకర్ ఉన్నారు.

ప్రజల సంక్షేమమే కూటమి ధ్యేయం

●జిల్లావ్యాప్తంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు



కవిటి: రాజపురంలో మాట్లాడుతున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్



పోలాకి: దీర్ఘాసిలో కరపత్రం అందజేస్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



హరిపురం: మందస మండలంలోని బీవైఆర్‌పురంలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



అరసవల్లి: దండివీధిలో మురుగు కాలువను పరిశీలిస్తున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని టీడీపీ నాయకులు తెలిపారు. మంగళవారం జిల్లాలోని పలుచోట్ల తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ కార్యక్రమాల్లో భాగంగా సామాజిక పింఛన్లు పెంపుదల, తల్లికి వందనం కార్యక్రమాలను అమలుచేసినట్లు తెలిపారు. ఉచిత గ్యాస్ పంపిణీ చేపట్టామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఆగస్టు 15న ప్రారంభమవుతుందన్నారు. (ఆంధ్రజ్యోతి-బృందం)



కొత్తూరు: కురిగాంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పీ-4 కార్యక్రమం పక్కాగా అమలు: కలెక్టర్

శ్రీకాకుళం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రజలభాగస్వామ్యంతో పేదరిక నిర్మూ లనకు కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పీ-4 కార్యక్రమం పక్కాగా అమలు చేస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు. జిల్లాలో పీ-4పై సమగ్ర సర్వేలో ఇప్పటివరకు 75,566 బంగారు కుటుంబాలు, 5,171 మార్గదర్శకులను గుర్తించామని తెలిపారు. ఇం దులో 24వేల కుటుంబాలకు దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకొ చ్చారని, వారికి అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. పీ-4 కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ఇందులో భాగస్వామ్యయ్యారని తెలిపారు. జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ప్రణాళిక విభాగం సారథ్యంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సర్వేచేసి నిరుపేద కుటుంబాలను గుర్తించారని, ఆగస్టు 15లోగా జిల్లాలో ఇంతవరకు గుర్తించిన 75 వేల కుటుంబాలను దత్తత తీసుకునే కార్యక్రమాన్ని శతశతం పూర్తిచేస్తామని వివరించారు. నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే ఈ కార్యక్రమంలో దాతృత్వం ఉన్న దాతలంతా విధిగా ముందుకు వచ్చి దత్తత తీసుకోవాలని కోరారు.

డ్రైనేజీ వ్యవస్థ రూపురేఖలు మారుస్తాం: ఎమ్మెల్యే

అరసవల్లి జూలై 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని డ్రైనేజీ వ్యవస్థల రూపురేఖలను మారుస్తామని, దీనికోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని దండివీధి, సీబీ రోడ్డు పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు.కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, జంగమ సాధికార సమితి డైరెక్టర్ విభూది సూరిబాబు, నక్క శంకరరావు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలి: ఎన్ఈఆర్

రణస్థలం, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశభక్తి భావంతో నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. మంగళవారం రణస్థలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో పీఎంశ్రీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల ప్రతిభ, తల్లి దండ్రుల విశ్వాసానికి గౌరవ సూచికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుచేస్తున్న పీఎంశ్రీ పథకం కింద రణస్థలం ఆదర్శపాఠశాల ఎంపికయ్యిందని తెలిపారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు నిర్వహించాలి

జి.సిగడాం, జూలై 29(ఆంధ్రజ్యోతి): సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలని ఉపాధిహామీ పథకంప్రోగ్రాం అధికారి గుంటముక్కల రామకృష్ణ కోరారు. మంగళవారం జి.సిగడాంలో ఏర్పాటుచేసిన ఎన్ఆర్ఈ జీఎస్ సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.25 కోట్లతో చేపట్టిన వివిధ పనులపై సామాజిక తనిఖీలు ఈనెల 30 నుంచి ఆగస్టు 14 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్పీ సత్యనారాయణ, ఏపీవో సత్యనారాయణ, ఈసీ పురుషోత్తమరావు, పీఆర్‌జేఈ లతశ్రీ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ట్యూటర్ల నియామకానికి చర్యలు

జి.సిగడాం, జూలై 29(ఆంధ్రజ్యోతి): వసతి గృహల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల కోసం ఆగస్టు 1 నుంచి ట్యూటర్స్‌ను నియమిస్తున్నట్లు రణస్థలం ఏబీసీడబ్ల్యూవో జి.చంద్రమౌళి తెలి పారు. మంగళవారం జి.సిగడాం, సంతవురిటి బీసీ బాలుర వసతి గృహాలను తనిఖీచేశారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

ఆమదాలవలస,జూలై29(ఆంధ్రజ్యోతి):మినిమం టైంస్కేల్‌తో (ఎంటీఎస్) ఉపాధ్యాయుల కుటుంబాలు ఆకలికేకలతో అలమటిస్తున్నారని డెమో క్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ అధ్యక్షుడు పైడి రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ నెల జీతాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు.ఇటీవల జరిగిన బదిలీల్లో చాలా మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులకు దూర ప్రాంతాలకు బదిలీ చేశారని, జీతాలు లేక బస్సులు చార్జీలు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్నారని తెలిపారు.

ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి

శ్రీకాకుళం కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని స్పిచువల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు భీమినేని వంశీకిరణ్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ జంక్షన్‌లోన్ని పిరమిడ్ స్పిచువల్ కేంద్రంలో ఆధ్యాత్మిక సజ్జన సాంగత్యం నిర్వహించారు. కార్యక్రమంలో బాలాజీరావు, బిందుమాధవి, ధర్మారావు, శివ పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించాలి

జి.సిగడాం, జూలై 29(ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని టీడీపీ మండలాధ్యక్షుడు కుమరాపు రవికుమార్ కోరా రు. మంగళవారం వెంకయ్యపేటకు చెందిన రైతు ఆరెళ్ల గొళ్లాజీ పంట పొలంలో ఆయిల్ ఫాం మొక్కలునాటారు. ఈసందర్భంగా ఉద్యానవన శాఖ అధికారులు ఉద్యాన వన పంటల సాగుకు ప్రభుత్వం అందజేస్తున్న రాయి తీలపై రైతులకు అవగాహ న కల్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాయల రమణ, ఉద్యానవనశాఖ అధికారి అమరేశ్వరి, వీఎంఏ గిరిజ పాల్గొన్నారు.

108 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

సరుబుజ్జిలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కంచిలి జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం 108 మందికి తనిఖీలు చేయగా 12 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.మోహన్‌రావు తెలిపారు. కార్య క్రమంలో హెచ్ఎం కృష్ణారావు, ఆప్తాలమిక్ అసిస్టెంట బాబూరావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగుపరచాలి

ఇచ్ఛాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగుపరచాలని ఎంఈవో కె.అప్పారావు కోరారు. మునిసిపాలిటీలోని పంజావీధి పాఠశాలను పరిశీలించారు.







వీడియోలు చూసి.. ఉచ్చులో పడి

● మోసపోయిన బ్యాంకు ఉద్యోగి ● రూ 11.5 లక్షలు టోకరా పెట్టిన సైబర్ నేరగాళ్లు

రణస్థలం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐలో పనిచేస్తున్న ఓ తాత్కాలిక చిరు ఉద్యోగి సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడ్డాడు. ఈ మేరకు రూ.11.5 లక్షలు టోకరా పెట్టారు. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కథనం మేరకు.. కొంచెర్ల గ్రామానికి చెందిన దుంప కృష్ణ చిత్తూరు జిల్లాలోని మెట్టూరు ఎస్‌బీఐ బ్యాంకులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వాట్సప్ యాప్ లింకులో తరచూ వీడియోలు చూసి సబ్‌స్క్రైబ్ చేస్తే డబ్బులు వచ్చేవి. రూ.40వేలు కడితే రూ.70వేలు వస్తుందని, అలాగే ఇంకా ఎక్కువ కడితే ఎక్కువ వస్తుందని ఆన్‌లైన్ వ్యాలెట్‌లో చూపడమే తప్పా చేతికి డబ్బులు వచ్చేవి కావు. గెలుచుకున్న డబ్బులు రావాలంటే మరికొంత కట్టాలని కడితే వెంటనే మీ అకౌంట్‌లో క్రెడిట్ అవుతుందని ఆశచూపి జూలై 13న నాటికి రూ 11.5లక్షలు నష్టపోయాడు. చివరికి మోసపోయానని తెలుసుకున్నాడు. ఒత్తిడికి గురై ఫోన్ చేయకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు కృష్ణ ఉన్న చోటకు వెళ్లి తీసుకొచ్చారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన విషయం జేఆర్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి చిత్తూరు జిల్లా మెట్టూరుకు బదిలీ చేసినట్లు జేఆర్‌పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

టీడీవలసలో పరిశుభ్రతపై అవగాహన

జి.సిగడాం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీవలసలో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అధికారులు అవగాహన కల్పించారు. రోడ్లపై వ్యర్థాలు వేయవద్దని,చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో గంటముక్కల రామకృష్ణ సూచించారు. కాచీ చల్లార్చిన నీరు తాగాలని జిల్లా మలేరియా నివారణాధికారి సత్యనారాయణ, వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, సుమబిందు తెలిపారు. ఇంటింటికి వెళ్లి రోగాలపై ఆరాతీశారు. గ్రామంలో క్లోరినేషన్, శానిటేషన్ చేయించారు.

కూర్మనాథుని దేవస్థానానికి ఏసీ వితరణ

గార, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మనాథుని దేవస్థానానికి స్థానిక యూనియన్ బ్యాంక్ సిబ్బంది ఏసీ,కంప్యూటర్‌ను ఈవో కె.నరసింహనాయుడుకు అందజేశారు.కార్యక్రమంలో బ్యాంకు రీజనల్‌హెడ్ పైడి రాజా, బ్రాంచ్ మేనేజర్ గోరు చిన్న రామయ్య, చీఫ్ మేనేజర్ విశ్వనాథ్, సీనియర్ మేనేజర్ సూర్య కిరణ్ పాల్గొన్నారు.







రైలు కిందపడి యువకుడు మృతి


చిట్టిబాబు మృతదేహం

నరసన్నపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): కామేశ్వరిపేట రైల్వేగేట్ సమీపంలో సోమవారం రాత్రి జరుగుళ్ల చిట్టిబాబు (31) అనే యువకుడు గుర్తుతెలియని రైలు కింద పడి మృతిచెందినట్టు శ్రీకాకుళం రోడ్ హెచ్‌సీ మధుసూదనరావు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మంగళవారం ఉదయం ఉర్లాం- కామేశ్వరిపేట ట్రాక్ మధ్య ఉన్న చిట్టిబాబు మృతిదేహాన్ని గుర్తించారు. మృతుడిది బలగ సమీపంలో గల బుచ్చిపేటకు చెందిన జరుగుళ్ల అప్పారావు కుమారుడు చిట్టిబాబుగా గుర్తించినట్టు హెచ్‌సీ తెలిపారు. అయితే చిట్టిబాబు మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

కాలువలో పడి ఒకరు ..

శ్రీకాకుళం క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులో గల మురుగు కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు... ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామానికి చెందిన నూక సింహాచలం(55) కిడ్నీలో రాళ్లు ఉండడంతో కొద్దిరోజులుగా రిమ్స్‌కు వెళ్లి చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తన కుమారుడితో సింహాచలం ఇంటి నుంచి బయలుదేరి అంబేడ్కర్ కూడలికి చేరుకున్నాడు. అక్కడి నుంచి సింహాచలం ఒక్కడే ఆర్ట్స్ కళాశాల రోడ్డు గుండా రిమ్స్‌కు నడుచుకుంటూ బయలుదేరాడు. కాస్త దూరం వెళ్లే సరికి అస్వస్థతకు గురై వాంతులు చేసుకొనేందుకు పక్కనే ఉన్న మురుగు కాలువ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. స్థానికులు గమనించి సింహాచలాన్ని బయటకు తీసి అతడి కుమారుడికి సమాచారం తెలియజేశారు. అంబేడ్కర్ జంక్షన్‌లో గల ఓ జెరాక్స్ షాపులో పనిచేస్తున్న అతడి కుమారుడు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని రిమ్స్‌కు తరలించగా.. అప్పటికే సింహాచలం మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సింహాచలం కుమారుడు ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్ఐ రామారావు కేసు నమోదు చేశారు. సింహాచలానికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


పాతపట్నంలో చైన్ స్నాచింగ్ కలకలం


బాధితురాలు కాళ్ల జ్యోతి

పాతపట్నం, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక నీలకంఠేశ్వరుని ఆలయ సమీపంలో ఓ మహిళ మెడలోని పుస్తెలు తాడు తెంపుకుపోయిన ఘటన మంగళవారం మధ్యాహ్నం పాతపట్నంలో కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాతపట్నం కోటగుడ్డి కాలనీకు చెందిన కాళ్ల జ్యోతి స్థానిక నీలకంఠేశ్వర ఆలయ చేరువలో ఉన్న పశువులశాల వద్ద పనులు చేసుకుంటుంది. మంగళవారం మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు వచ్చి మంచినీరు ఇవ్వాలని జ్యోతిని అడి గారు. పక్కనే ఉన్న ఆలయంలో వద్దకు వెళ్లమని చెప్పింది. పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో ఒక్క ఉదుటన ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తులతాడు తెంపుకుని కాపుగోపాలపురం మీదుగా పర్లాకిమిడివైపు బైక్‌పై ఉడా యించారు. బాధితురాలు తేరుకుని కేకలు వేయగా.. కాస్త దూరంలో ఉన్న కొంత మంది వచ్చి విషయం తెలుసుకుని బైక్‌పై వెంబడించినా వారి ఆచూకీ తెలియ రాలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పరిశరాల్లో ఉన్న సీసీ ఫేటేజీలను పరిశీలిస్తున్నారు. జ్యోతి ఫిర్యా దు మేరకు ఎస్ఐ బి.లావణ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశా టూ.. ముంబై

- ఇచ్ఛాపురంలో 34.3 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి గంజాయిని ముంబై తరలిస్తుండగా ఇచ్ఛాపురంలో ఓ వ్యక్తి అరెస్టయ్యాడు. ఈ మేరకు పోలీసులు 34.3 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఇచ్ఛాపురంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నంనాయుడు పట్టణ ఎస్ఐ ముకుంద రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. ఒడిశాలోని గంజాం జిల్లా ఖరియాగూడ ప్రాంతానికి చెందిన సంతున్ దాసు రైతుల వద్ద 34.3 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. దాన్ని ముంబైలోని మలాడ్ ప్రాం తంలో ఉంటున్న లొటొకుండ అనే వ్యక్తికి విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ఒడిశా నుంచి ద్విచక్ర వాహనంపై ఇచ్ఛాపురం చేరుకున్నాడు. గంజా యి తరలిస్తున్నట్లు పట్టణ ఎస్ఐ ముకుందరావుకు సమాచారం అందింది. దీంతో ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ రెండో ప్లాట్ ఫారం, ఎల్‌సీ గేటు వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రెండు లగేజీ బ్యాగులతో 18 గంజాయి ప్యాకెట్లతో బైక్‌పై సంతున్ దాసు వస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. గంజాయిని సీజ్ చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

నాసిరకం మందుల తయారీ కంపెనీ యజమానికి జైలు

శ్రీకాకుళం, జూలై 29(ఆంధ్రజ్యోతి): నాసిరకం మందుల తయారు చేస్తున్న కంపెనీ యజమాని మనోజ్‌కుమార్ రాంబల్‌కు ఒక రోజు జైలు, రూ.50వేలు జరీమానాను విధిస్తూ శ్రీకాకుళం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కేఎం జమ్మత్ బేగమ్ తీర్పునిచ్చారు. జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు చంద్రరావు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళంలో 2017 అక్టోబరు 10న ఓ మందుల దుకాణంలో విటమిన్-ఏ పీడియాట్రిక్ ఓరల్ సొల్యూషన్ (చిన్నపిల్లలకు నోటిలో వేసే మందు)ను నమూనాలను జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. ఆ ఓరల్ సొల్యూషన్‌లో ప్రామాణికాలు లోపించాయని నిర్ధారణ అయింది. దీంతో ఈ మందు తయారు చేసిన కంపెనీ సన్‌రైజ్ ఇంటర్‌నేషనల్ ల్యాబ్స్ లిమిటెడ్ యజమాని మనోజ్‌కుమార్ రాంబల్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి కోర్టులో కేసు విచారణ జరుగుతోంది. సీనియర్ ఏపీపీ పి.సుశీల కోర్టులో వాదనలు వినిపించారు. ఈ మేరకు ముద్దాయి మనోజ్‌కుమార్ రాంబల్ తన నేరాన్ని అంగీకరించారు. జిల్లా వ్యాప్తంగా తరచూ మందుల నమూనాలను సేకరిస్తున్నామని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు చంద్రరావు అన్నారు. ఔషధ చట్టం ఉల్లంఘనలపై జిల్లాలో 44 కేసులు నమోదు చేశామని, కోర్టుల్లో విచారణ జరుగుతోందని స్పష్టం చేశారు.

కామ్రేడ్ చారు మజుందార్‌కి నివాళి


చారు మజుందార్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పలాస రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడి ప్రజల హృదయాల్లో నిలిచిన వ్యక్తి చారు మజుందార్ అని పలువు పలువురు వక్తలు అన్నారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో మంగళవారం వెస్ట్‌బెంగాల్‌కు చెందిన కామ్రేడ్ చారు మజుందార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి, ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, ప్రతినిధులు కె.దుష్యంత్, ఎం.రామారావు, పి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

నందిగాం, జూలై 29(ఆంధ్రజ్యోతి): నందిగాంలోని పలు వీధుల్లో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాలపై టీడీపీ నాయకులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు మదన్‌గౌడ్, కె.జయరాం, అక్కురాడ కూర్మారావు, ప్రదీప్‌కుమార్ పాణిగ్రాహి, పి.ప్రకాశరావు, కె.సతీష్‌కుమార్, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తొలగిన అడ్డంకులు

- తాళభద్ర-నర్సిపురం రహదారికి మార్గం సుగమం
- హద్దులు గుర్తించి కంచె వేస్తున్న రైల్వేశాఖ
- నెరవేరనున్న దశబ్దాల నాటి కల


తాళభద్ర ఎల్‌సీ గేటు వైపు చురుగ్గా సాగుతున్న కంచె నిర్మాణ పనులు

పలాస, జూలై 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటి ఏర్పడి 25 ఏళ్లు అవుతున్నా తాళభద్ర-నర్సిపురం ప్రజల చిరకాలవాంఛ పక్కా రహదారికి అనేక అంక్షలు అడ్డొచ్చాయి. ఈ రహదారి పలాస రైల్వే స్టేషన్ సమీపంలో ఉండడంతో పాటు పూర్తిగా రైల్వేశాఖ పరిధిలోకి రావడంతో మున్సిపల్ అధికారులు రహదారి నిర్మాణాన్ని చేపట్టలేకపోయారు. అప్పటి కేంద్రమంత్రిగా పనిచేసిన దివంగతనేత కింజరాపు ఎర్రన్నాయుడు సైతం రహదారి కోసం పోరాడి రైల్వేశాఖ అంక్షలు కారణంగా చేతులు ఎత్తేశారు. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్‌నాయుడు దృష్టికి ఈ రోడ్డు సమస్య తీసుకువెళ్లినా.. ఆయన సైతం మౌనం దాల్చాల్సిన పరిస్థితి వచ్చింది. ఎట్టకేలకు రైల్వే అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మూడో రైల్వేలైన్ నిర్మిస్తున్న నేపథ్యంలో పక్కాగా హద్దులు గుర్తించాల్సి వచ్చింది. దీంతో పాటుగా మొత్తం రైల్వే భూములకు రక్షణగా పక్కా గోడల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా తాళభద్ర ఎల్‌సీ గేటు నుంచి కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వరకూ సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా కంచె నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో నెలలో మొత్తం పనులన్నీ పూర్తయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో తాళబద్ర-నర్సిపురం రహదారి మరోమారు తెరపైకి వచ్చింది. ఈ రహదారి నిర్మాణం జరిగితే రెండు గ్రామాలకు లింకు రోడ్డు ఏర్పడడంతో పాటు వజ్రపుకొత్తూరు మండలవాసులకు కాశీబుగ్గ రోడ్డును దాటకుండా పాత జాతీయ రహదారి మీదుగా శ్రీకాకుళం, విశాఖ వంటి దూరప్రాంతాలకు వెళ్లడానికి మార్గం ఏర్పడుతుంది. దీంతో గంటల కొద్ది గేటువద్ద వేచి ఉండకుండా రెండు రైల్వేగేట్లు తగలకుండా వెళ్లడానికి వీలవుతుంది. గతంలో మున్సిపాలిటి అధికారులు రహదారి నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకున్నా రైల్వేశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఆ పనులు వెనక్కు మళ్లాయి. ప్రస్తుతం రైల్వేశాఖ తమ పరిధిలో భూములకు రక్షణ గోడ నిర్మాణం చేపట్టి నర్సిపురం-తాళభద్ర రహదారిని విడిచిపెట్టింది. దీంతో పక్కా రహదారి ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం కావడంతో ప్రజలు పక్కా రహదారికోసం ఎదురుచూస్తున్నారు. 24 అడుగుల వెడల్పుమేరకు రహదారి నిర్మించడానికి అవకాశాలు ఉండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఆర్థిక నిధులు వెచ్చించి ఈ రహదారికి మోక్షం కల్పించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

గిరిజన విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


ఆశ్రమ పాఠశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

హరిపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన విద్యార్థుల విద్యకు కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం డబార్సింగి గ్రామంలో పీఎం జన్‌మాన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.2.30 కోట్లతో కొత్తగా మంజూరైన పాఠశాల భవనానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఐటీడీఏను దివంగత ఎన్టీఆర్ ఏర్పాటు చేస్తే సీఎం చంద్రబాబు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆశ్రమ పాఠశాలలు భ్రష్టుపట్టాయని, గిరిజన విద్యార్థుల కోసం కొత్తగా మంజూరైన పాఠశాలకు భవనం నిర్మించి ఏడాదిలో ప్రారంభిస్తామని చెప్పారు. దీనిని గిరిజన ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే కిల్లోయి, బంజరి యువరాజపురం గ్రామాల్లో రైతులకు ఎరువుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆమెతో పాటు టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, రట్టి లింగరాజు, దాసరి తాతారావు, మహేష్, మంగళి పాత్రో, తమిరి భాస్కరరావు, నవీన్, సాలిన మాధవరావు, డుంకూరు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్గో ఎయిర్‌పోర్టుతో పలాస అభివృద్ధి

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

పలాస, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మందస-వజ్రపుకొత్తూరు మండలాల మధ్యలో ఏర్పాటు కానున్న కార్గో ఎయిర్‌పోర్టుతో పలాస చరిత్ర మారుతుందని, అన్నివర్గాలవారు సహకరించాలని వ్యవసాయశాఖ మంత్రి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. మంగళవారం రాత్రి స్థానిక పద్మనాభపురం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద పలాస ఏఎంసీ చైర్మన్‌గా ఎంపికైన మల్లా శ్రీనివాసరావు, డైరెక్టర్లతో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు వైసీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏఎంసీల బలోపేతానికి చర్యలు తీసుకుంటుందన్నారు. మార్చి నెలాఖరునాటికి కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసి చంద్రబాబుతో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రూ.5కే అన్న క్యాంటీన్లలో అన్నం పెడుతుంటే వైసీపీ నేతకు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి కొత్త పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నామన్నారు. మూలపేట పోర్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని, ఈ ఏడాదిలో షిప్‌లు వచ్చేలా పనులు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ పలాసలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి వైసీపీ నాయకులు ఓర్వలేక సోషల్‌మీడియాలో వికృతచేష్టలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పీసీఎంఏ ప్రధాన కార్యదర్శి టంకాల రవిశంకర్ గుప్తా, నాయకులు చౌదరి బాబ్జీ, వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, మల్లా కృష్ణారావు, సూరాడ మోహనరావు, వంకల కూర్మారావు, దడియాల నర్సింహులు, బోయిన గోవిందరాజులు, పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి రోషిణి

కోటబొమ్మాళి, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారి ఎం.రోషిణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె మాట్లాడుతూ.. రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్, బ్యాంకు, ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు వర్గాల అంగీకారంతో పరిష్కరించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

కోటబొమ్మాళి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల ప్రకాశనగర్ కాలనీలో వాటర్ ట్యాంక్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అదే కాలనీకి చెందిన కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని, పరిశీలించి అడ్డుకోవాలని ఆ కాలనీకి చెందిన డి.రాము, బి.కృష్ణారావు, బి.శ్రీను కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ఈ స్థలం రోడ్డుకు మలుపు దగ్గర ఉండడం వల్ల ఇక్కడ ఇల్లు నిర్మిస్తే ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు.

జంగిల్‌ను క్లియర్ చేయించండి

పోలాకి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రహదారులకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను జంగిల్ క్లియరెన్స్ ద్వారా తొలగించాలని ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందిని డ్వామా పీడీ సుధాకర్ ఆదేశించారు. మంగళవారం ఆయన డోల, పల్లిపేట, వెదుళ్లవలస,. మొగిలిపేట గ్రామాల్లో పర్యటించారు. చెరువు పనులను నీరు నిల్వ ఉన్నందున నిలిపివేయాలని రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలే చర్యలు చేపట్టాలన్నారు. ఏపీవో రమణారావు, ఈసీ మునీంద్ర, మాజీ సర్పంచ్ ఉదయభాస్కర్, సాంకేతిక సహాయకులు సురేష్‌కుమార్, క్షేత్ర సహాయకులు ఉన్నారు.


రాకపోకలకు ఇబ్బందిలేకుండా చూడండి

ఎల్ఎన్ పేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్య కడపలగెడ్డపైన జరుగుతున్న నిర్మాణపు పనులు నిలిచిపోవడంతో ఆ గ్రామాలతోపాటు ఇతర గ్రామాల నుంచి వచ్చిన ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణ ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. కడపలగెడ్డ బ్రిడ్జి నిర్మాణ పనులు ఇటీవల కురిసిన వర్షపు నీటికి కాలువల నీరు తోడు కావడంతో జరుగుతున్న పనులు నిలిచిపోవడంతో మంగళవారం ఆయన పరిశీలించారు. రెండు గ్రామాల మధ్య వర్షాకాలమంతా రాకపోకలకు ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. గుంతలన్నీ పూడ్చివేసి ఎలాంటి ఇబ్బందిలేకుండా చేయాలని ఆర్అండ్‌బీ డీఈ సుధాకర్, ఏఈని ఆదేశించారు. పనులు జరుగుతున్న సమయంలో అలసత్వం చూపిన వల్లే ఈ పరిస్థితి నెలకొందని దబ్బపాడు మాజీ సర్పంచ్ జె.మోహనరావు ఎస్ఈ దృష్టికి తీసుకువచ్చారు. ఈయనతోపాటు ఈఈ తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

సంతబొమ్మాళి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా కేపీహెచ్‌వీ రాజు, అధ్యక్షుడిగా దుంప శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఉప్పాడ ఉమాపతి, సాధారణ కార్యదర్శిగా బి.రమేష్, ఉప కార్యదర్శిగా కె.మౌనిక, కోశాధికారిగా ఐ.మోహనరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎంపీడీవో జయంత్‌ప్రసాద్ వ్యవహరించారు.

రైతులందరికీ యూరియా అందిస్తాం


రైతులకు యూరియా అదిస్తున్న ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): రైతులందరికి పూర్తిస్థాయిలో యూరియా అందిస్తామని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. మంగళవారం ఉద్దాన గోపినాథపురంలో రైతులకు యూరియాను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తుందన్నారు. టీడీపీ నాయకులు కర్ని రమణ, మధనాల జోగారావు, సీపాన గోపి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

టెక్కలి, జూలై 29(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలపల్లి మదన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం టెక్కలిలో గల సాంఘిక సంక్షేమ వసతిగృహాలను ఏబీవీపీ విద్యార్థి బృందం పరిశీలించి అక్కడ లోపాలను గుర్తించి విద్యార్థుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతిగృహల్లో అధ్వాన్న పరిస్థితులు, మరుగుదొడ్ల దుస్థితి వివరించారు. స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలో గల ఎస్టీ హాస్టల్‌లో వార్డెన్ వారానికి ఒకసారి కూడా హాజరు కారని, అక్కడ భోజనం బాగులేక స్టౌవ్‌లు తెచ్చుకొని రూమ్‌లో వండుకుంటున్నారన్నారు. నాయకులు శ్యామ్, ఆర్య ఉన్నారు.

మందస పశువైద్యశాల తనిఖీ

మందస, జూలై 29(ఆంధ్రజ్యోతి): మందస పశువైద్య కేంద్రాన్ని మంగళవారం డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ నర్సింహులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువైద్య కేంద్రంలో లంపిస్కిన్ వాక్సినేషన్, థేయలేరియా వ్యాక్సినేషన్ పురోగతిపై పశువైద్యాధికారి శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.

శరవేగంగా సెంట్రల్ లైటింగ్ పనులు


జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులు

కోటబొమ్మాళి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి పెద్ద చెరువు వరకు చేపడుతున్న సెంట్రల్ లైటింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సెప్టెంబరు 23 నుంచి జరగనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలకు ముందే సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించడంతో పనులు చకాచకా సాగిపోతున్నాయి. ఈ సెంట్రల్ లైటింగ్ పనులను సుడా ఎస్ఈ సుగుణాకరరావు, సుడా ఇన్‌చార్జి డీఈ రామనందం, ఏఈ జగదీష్ పర్యవేక్షిస్తున్నారు.

అధికారులు మారినా.. అధికారం వారిదే

(ఐదో పేజీ తరువాయి)

కొంతమంది ఆలయ సిబ్బంది మాత్రం బాహాటంగానే వీటిపై చర్చించుకోవడం గమనార్హం. అరసవల్లికి చెందిన ఓ ఉద్యోగి కుమారుడు.. ఆలయంలో దినసరి వేతనంపై పనిచేస్తూ బిల్లులు తయారీ, ఇతర పనుల్లో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. గతంలో ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఓ ఉద్యోగి.. దినసరి వేతనదారుల ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడిన సంఘటనలో సస్పెండ్ అయ్యాడు ఈ మొత్తం వ్యవహారంలో కీలకంగా వ్యవహరించి, వసూళ్లను చేసి, విజయవాడ కార్యాలయానికి తరచూ వెళ్తూ.. ప్రధాన భూమిక పోషించిన ఆ దినసరి ఉద్యోగే నేడు మళ్లీ ఆలయ కార్యాలయ విధుల్లో కీలకంగా మారాడు. అలాగే గతంలో ఇక్కడ జూనియర్ అసిస్టెంట్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూనే విజయనగరానికి బదిలీపై వెళ్లిపోయారు. నిజానికి సస్పెండ్ అయిన సీనియర్ అసిస్టెంట్ అక్రమాల విషయంలో వీరిద్దరే ప్రధాన భూమిక పోషించార ని, మధ్యలో ఆయన బలైపోయారనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రస్తుతం ఆలయంలో పనిచేస్తున్న మరో దినసరి ఉద్యోగిని కూడా ఆరోపణలపై విధుల నుంచి తొలగించారు. కానీ మూడు నెలల తరువాత ఆ ఉద్యోగి ఆలయ విధుల్లో చేరి అన్ని విషయాల్లో కీలకంగా వ్యవహరిస్తుండడం విశేషం. కార్యాలయంలో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఏమాత్రం లేకపోవడమే ఇందుకు కారణం. అలాగే దినసరి ఉద్యోగులకు 14 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండగా.. సుమారు 3 నెలలు కోత విధించి.. డబ్బులు విడుదల చేశారు. కానీ అక్రమాల్లో కీలకంగా వ్యవహరించిన ఈ దినసరి వేతన ఉద్యోగి మాత్రం పూర్తి జీతం అందుకున్నాడు. దీనిపై మిగిలిన దినసరి వేతనదారులకు తెలిసినా ఆలయ అధికారిక విధుల్లో కీలకంగా వ్యవహరిస్తుండంతో వారు ఏం మాట్లాడలేకపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, నాయకులు స్పందించి ఆలయంలో పరిస్థితిని చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ పాతపట్నం పరిధిలోని 30వ తేదీ బుధవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టెక్కలి ఈఈ నరసింహకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా సాయినగర్ కాలనీలతోపాటు దశరథపురం, తిడ్డిమి, సూర్యనారాయణపురం, రంకిణి. చంగుడి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆర్‌డీఎస్ఎస్ ప్రాజెక్ట్ పనుల కారణంగా ఈ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీ-4 జాబితాలు సిద్ధం చేయాలి

హరిపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీ4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబం వారి మార్గదర్శకుల జాబితాలను సిద్ధం చేయాలని మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధక శాఖ ఏడీ నర్సింహులు కోరారు. మందస మండల కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, డీటీ రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో తిరుమలరావు, దువ్వాడ శ్రీకాంత్, ఏవో నాగరాజు, రుషి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పనిచేయాలి

టెక్కలి, జూలై 29(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు ఉత్సాహంగా పనిచేయాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు బగాది శేషగిరి, జీరు భీమారావు, బోకర నారాయణరావు, రామ్‌జీ, లక్ష్మీనారాయణ, అన్నెపు ఉమామహేశ్వరరావు, ప్రకాష్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టాలిన్ మాస్టారుకు కవితా పురస్కారం


స్టాలిన్ మాస్టారుకు

టెక్కలి, జూలై 29(ఆంధ్రజ్యోతి): టెక్కలికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయులు డీఏ స్టాలిన్ మాస్టారుకు విశాఖకు చెందిన అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కవితా పురస్కారాన్ని అందజేశారు. స్టాలిన్ మాస్టారు కార్గిల్ దివాస్‌ను పురస్కరించుకొని 'వీర సైనిక నీ త్యాగం అమరం' పేరిట రాసిన ఈ కవితకు పురస్కారం లభించింది. డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కుమార్, డాక్టర్ పార్థసారథి, జి.ఈశ్వరీభూషణం తదితరులు ఈ కవితా పురస్కారాన్ని స్టాలిన్ మాస్టార్‌కు అందజేశారు. పురస్కారం రావడంపై ప్రజాచైతన్య కళాసమితి ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

మెరుగైన సేవలందించేందుకే ప్రజాదర్బార్

పోలాకి, జూలై 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకే ప్రతీరోజూ ప్రజాదర్బార్ తన క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ప్రతీ సోమ, బుధ, శనివారాల్లో పార్టీ కార్యాలయంలో ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటాన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమ దిశగా పనిచేస్తోందన్నారు. వచ్చే నెలలో మహిళలకు ఉచిత బస్, ఆటోడ్రైవర్లకు ఆర్థికసాయం, రైతు భరోసా అందించనున్నట్టు తెలిపారు. సమన్వయకర్త బగ్గు అర్చన, పీఏసీఎస్ అధ్యక్షులు బైరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ డ్రైవర్లకు ధ్రువపత్రాల పంపిణీ

అరసవల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 21వ బ్యాచ్ డ్రైవర్లకు ఇన్‌చార్జి జిల్లా ప్రజా రవాణా అధికారి హెచ్.అమరసింహుడు మంగళవారం సర్టిఫికేట్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22వ బ్యాచ్ శిక్షణ ఈ వారంలో ప్రారంభంకానుందని, లైట్‌మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి, ఏడాది అనుభవం కలవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పీవో కృష్ణవేణి, ఏఓ రాజు, రెండో డిపో మేనేజర్ రవిశంకర్ శర్మ, శిక్షకులు వాసు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసింది జగనే

కవిటి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను జగన్ మాత్రమే అమలు చేశారని జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ తెలిపారు. మంగళవారం జగతి, వరక, కుసుంపురం, మాణిక్యపురంల్లో వైసీపీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైసీపీ మండలాధ్యక్షుడు కె.ప్రకాష్, వైస్ఎంపీపీ పి.నేతాజీ, పి.కృష్ణారావు, పి.చంద్రశేఖర్, పి.నీలాచలం, వై.నీలయ్య పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

నరసన్నపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక విలేకర్ కాలనీలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ పార్లమెంట్ నియోజవర్గ అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు అన్నారు. మంగళవారం రూ.3 లక్షలు నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబుతో కలిసి ప్రారంభించారు. కాలనీలో అంతర డ్రైనేజ్ వ్యవస్థ, ఇంటింటా తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడంతో పాటు మోడల్ కాలనీలో తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీస కృష్ణ, సదాశివుని కృష్ణ చిన్నవాడు, పుచ్చల కల్పన, చిట్టిపంతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కవిటి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రామయ్యపుట్టుగలో మంగళవారం ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ పంపిణీ చేశారు. రూ.6,76,616 చెక్కులను బాధితు కుటుంబ సభ్యులకు అందజేశారు. కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి మండలాల నాయకులు పాల్గొన్నారు.

- కంచిలి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపురానికి చెందిన మొగిలి అలీష్ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.52వేలు చెక్కును విప్ అశోక్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మాదిన రామారావు, ప్రదీప్ పాల్గొన్నారు.
- ఇచ్ఛాపురం, జూలై29(ఆంధ్రజ్యోతి): మునిపిపాలిటీలోని 23వ వార్డు బెల్లుపడ కాలనీకి చెందిన గవలపు సునీత అనారోగ్యంతో బాధపడుతుండడంతో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ90 వేలు ఎమ్మెల్యే అశోక్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పత్రి తవిటయ్య, ఎస్.కోటి, కౌన్సిలర్ ఆశి లీలారాణి, రామారావు పాల్గొన్నారు.